ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
మంగళవారం 23 జనవరి 2024

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం
- ఆదివారం నిరంతరాయంగా స్వామివారి దర్శనం - 7లో..

ఊరూరా.. రామ నామస్మరణ
- అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ - 8లో..



వేములవాడలో పునాదులకే పరిమితం



తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో పూర్తికాని పనులు



ముస్తాబాద్ మండలం గూడెంలో పంపిణీకి సిద్ధంగా ఇళ్లు

'డబుల్' ఇళ్లు అందేనా?

- కొత్త ప్రభుత్వ నిర్ణయంపై అయోమయం
- జిల్లాలో 6886 ఇళ్లు మంజూరు
- పూర్తయినవి 3546
- ఖర్చయిన నిధులు రూ.188.49 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లకు 1.10 లక్షల దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గూడు లేని పేదలు సొంతింటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం నత్తనడకనే సాగింది. ఏళ్ల గడిచినా నిర్మాణాలు పూర్తి కాలేదు. పూర్తయిన ఇళ్లు కూడా పూర్తిస్థాయిలో పంపిణీకి నోచుకోక లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా జిల్లాలో ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో ఇళ్ల పంపిణీకి సంవత్సర కాలం పట్టడం గమనార్హం. జిల్లాలో ఇప్పటికీ ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. పంపిణీకి నోచుకోక వెక్కిరిస్తున్న ఇళ్లు కూడా ఉన్నాయి. అసంపూర్తిగా మిగిలిన ఇళ్లు, మంజూరైన ఇళ్ల నిర్మాణాలపై కొత్త ప్రభుత్వంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే పేదలు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాలు దొరకకపోవడం, అదే క్రమంలో డబుల్ ఇళ్ల నిర్మాణాలకు స్టీల్, సిమెంట్, కూలీల రేట్లు ఇతర మెటీరియల్ ధరలు పెరగడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే నిర్మాణాలు నిలిపివేశారు. కొత్తగా నిర్మాణాలకు ముందుకు రాకపోవడంతో డబుల్ ఇళ్ల లక్ష్యం నెరవేరకపోవడం కూడా గత ప్రభుత్వానికి ట్రబుల్‌గా మారిందని చెప్పుకోవచ్చు. మరోవైపు లబ్ధిదారులకు అందించిన ఇళ్ల నిర్మాణాల్లో కూడా నాసిరకం పనుల డొల్లతనం బయటపడింది. ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోగా గత ప్రభుత్వం గృహలక్ష్మీ పథకాన్ని తీసుకొచ్చి దరఖాస్తులను స్వీకరించింది. ఎన్నికల కోడ్ రావడంతో మూలన పడింది. ప్రభుత్వం కూడా మారడంతో మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్లతోపాటు అమరవీరులకు, ఉద్యమకారులకు ఇంటి స్థలాలను అందించడానికి దరఖాస్తులను స్వీకరించింది. ప్రస్తుతం దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేశారు. డబుల్ లబ్ధిదారుల్లో మాత్రం గత ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పరిస్థితిపై అయోమయం నెలకొంది.

ఇందిరమ్మ ఇళ్లకు 1.10 లక్షల దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల్లో గృహలక్ష్మీ పథకంలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలో గ్యారెంటీలకు 1,92,617 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు 1,10,198 మంది, ఇంటి స్థలాల కోసం అమరవీరుల కుటుంబాలు 338, తెలంగాణ ఉద్యమకారులు 2130 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా వచ్చిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల నుంచి మళ్లీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే చర్చ కొనసాగుతోంది.

● జిల్లాలో సగానికి పరిమితం

జిల్లాలో 13 మండలాలకు సంబంధించి 6886 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారు. రూ.374.41 కోట్ల నిధులు వ్యయంగా నిర్ణయించారు. ఇందులో 5437 ఇళ్లకు మాత్రమే టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. 4248 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, 3546 పూర్తి చేశారు. ఇప్పటి వరకు 3448 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. రూ.188.49 కోట్లు ఖర్చు చేశారు. 702 నిర్మాణ దశలో ఉన్నాయి. కొన్ని దాదాపు పూర్తయినా మౌలిక సదుపాయాలు లేక పంపిణీకి నోచుకోవడం లేదు. కొన్ని పూర్తయినా అందించడం లేదు. జిల్లాలో సిరిసిల్ల మండలంలో 2052 ఇళ్ల లక్ష్యాన్ని పూర్తి చేశారు. ముస్తాబాద్ 702 ఇళ్లకు 429, తంగళ్లపల్లి 549 ఇళ్లకు 110, ఎల్లారెడ్డిపేట 490 ఇళ్లకు 320, గంభీరావుపేట 476 ఇళ్లకు 371, వీర్నపల్లి 160 ఇళ్ల మంజూరవగా 50 ప్రారంభించారు. ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఇల్లంతకుంటలో 340 ఇళ్లకు 184 పూర్తి చేశారు. వేములవాడ రూరల్ మండలంలో 1080 ఇళ్లకు 80 ఇండ్లు పూర్తవగా వేములవాడ అర్బన్‌లో 800 ఇళ్లకు ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. కోనరావుపేట మండలంలో 92, చందుర్తి 45, రుద్రంగి 35, బోయినపల్లి 65 ఇళ్ల మంజూరైనా ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభంకాలేదు. ప్రధానంగా వేములవాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిగా నిరాశ పర్చింది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే సగం కూడా పూర్తి కాలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మంజూరైనా ఇళ్లలో ఇప్పటివరకు ప్రారంభం కానివి ముస్తాబాద్‌లో 175, తంగళ్లపల్లి 178, ఎల్లారెడ్డిపేట 106, గంభీరావుపేట 43, వీర్నపల్లి 87, ఇల్లంతకుంట 156, వేములవాడ రూరల్ 1000, వేములవాడ అర్బన్ 656, కోనరావుపేట 92, చందుర్తి 45, రుద్రంగి 35, బోయినపల్లిలో 65 ఇళ్లకు టెండర్లు పూర్తయినా కొనసాగిస్తారా? కొత్త పథకంలో చేరుస్తారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతి ప్రదానం చేస్తున్న వికాస్‌రావు

చందుర్తి, జనవరి 22: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని బీజేపీ నేత చెన్నమనేని వికాసరావు అన్నారు. చందుర్తి మండలం రామారావుపల్లిలో ఆంజనేయ స్వామివారిని సోమవారం వికాస్ దీప దంపతులు దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన చందుర్తి మండల స్థాయి కబడ్డీ పోటీలో ప్రథమ విజేత కిష్టంపేట జట్టుకు, ద్వితీయ బహుమతి మల్యాల జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 22: డిజిటల్ తరగతుల సహాయంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను, వెంకంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి పరిశీలించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ (ఐఎఫ్‌పీ) సహాయంతో డిజిటల్ రూపంలో ఉపాధ్యాయులు తరగతులు బోధిస్తున్న విధానాన్ని, కంప్యూటర్ చాంప్స్ కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. బ్లాక్ బోర్డుల సహాయంతో తరగతులు బోధించే తీరు కంటే ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ (ఐఎఫ్‌పీ) సహాయంతో డిజిటల్ రూపంలో తరగతుల బోధన సులభంగా ఉంటుందని, విద్యార్థులకు త్వరగా తరగతులను అర్థం చేసుకునే వీలు కలుగుతుందని అన్నారు. అభ్యసన సామర్థ్యాలు మెరుగవుతాయన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకోవాలని, పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. కంప్యూటర్ చాంప్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం కంప్యూటర్ తరగతులు నిర్వహించాలని సూచించారు. తమ పరిధిలో ఉన్న వనరులను వినియోగించుకుంటూ ప్రభుత్వ పాఠశాలలపై మరింత నమ్మకం పెంచేలా విద్యాబోధన అందించాలని ఆదేశించారు. డీఈవో రమేష్ కుమార్ తదితరుల పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

రామభక్తిని చాటుకున్న హరిప్రసాద్



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్లు

సిరిసిల్ల టౌన్, జనవరి 22 : అయోధ్య శ్రీరామ మందిరంతో పాటు రామాయణం ఘట్టాలను పొందపరుస్తూ సీతమ్మ తల్లికి కానుకగా బంగారం, వెండితో కూడిన జరీ చీరను నేసి కానుకగా ఇచ్చి చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ రామ భక్తిని చాటుకున్నాడని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సీతమ్మ తల్లి కోసం బంగారం, వెండి జరి చీరను నేసి బహుమతిగా అయోధ్య పంపించాడు. సోమవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్ది హరిప్రసాద్ దంపతులకు నూతన వస్త్రాలు, రూ.11వేలు నగదు అందజేసి మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు సన్మా నించారు. ఈ సందర్భంగా కళాచక్రపాణి మాట్లాడుతూ 500 సంవత్సరాల స్వప్నం సాకారమైందన్నారు. వెల్ది హరిప్రసాద్ రామాయణంలోని వివిధ ఘట్టాలను పొందుపరిచి నేసిన బంగారు చీరను అయోధ్య రామమందిరానికి పంపించడం సిరిసిల్ల ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అయాజ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి



క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న డీఐఈవో

సిరిసిల్ల రూరల్, జనవరి 22 : జిల్లాలోని జూని యర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి చింతల మోహన్ కోరారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోషియేషన్ -711 జిల్లా కమిటీ అధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిరిసిల్ల పట్టణంలో డీఐఈవో కార్యాలయంలో సోమవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే విద్యార్థులు ఎక్కువగా సామాన్య, పేద కుటుంబాల నుంచి వస్తారని, వారికి చక్కని విద్యను అందించి ఉన్నత చదువులకు పంపాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని అన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో ఇంట ర్మీడియెట్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, జిల్లా అధ్యక్షుడు రేగుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సుమన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి విష్ణు ప్రసాద్, జయభారత్, అంజనేయులు, వాసరవేణి పర్శరాములు, నవీన్ రెడ్డి, క్రిష్టాకర్, భూమేష్, యాదగిరి, బుట్ట కవిత, మహేందర్, ప్రవీణ్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్ బాబు, సుధాకర్, వేణుగోపాల్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 22: బాలికలను రక్షించడంతోపాటు చదివిద్దామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బేటీబచావో బేటీపడావో కార్యక్రమం, ఈ నెల 24వ తేదీన జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాలిక విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ తయారు చేసిన పోస్టర్‌లను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడపిల్లలకు రక్షణ కల్పిద్దామన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఖీమ్యానాయక్, గౌతమి, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను పరిష్కరిస్తాం



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 22: బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో బాధితుల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలంబించనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ఆయన వెంట ట్రైనీ ఎస్పీ రాహుల్ రెడ్డి ఉన్నారు.

సెస్‌కు రూ.48లక్షలు కడితేనే
సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్

సిరిసిల్ల రూరల్, జనవరి 22 : సిరిసిల్ల పట్టణంలో శివారులో నిర్మించిన రెండో బైపాస్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్‌లు లేవని, సెస్‌కు రూ.48 లక్షలు కడితేనే కనెక్షన్‌లు ఇస్తామని చెప్పారని మున్సిపల్ డీఈఈ ప్రసాద్ తెలిపారు. 'రెండో బైపాస్ రోడ్డులో అంధకారం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ డీఈఈ స్పందించారు. పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన రెండో ఫోర్‌లైన్ బైపాస్ రోడ్డులో మున్సిపల్ నిధులతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ రెండు బైపాస్ రోడ్లలో లైటింగ్‌లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని సెస్ అధికారులను కోరామని, ముందుగా రూ. 48 లక్షలు చెల్లించాలని సెస్ ఎండీ నోటీస్‌లో పేర్కొన్నారని తెలిపారు. మున్సిపాలిటీలో నిధులు లేకపోవడంతో ఇంకా సెస్‌కు డబ్బులు చెల్లించలేదన్నారు. కేవలం రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల సహాయంతో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా తీసుకొని ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను వెలిగించి పరిశీలించామని వివరించారు.

25న జాతీయ ఓటరు దినోత్సవం

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 22: ఈ నెల 25న జిల్లాలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు.'నథింగ్ లైక్ ఓటింగ్, 'ఐ ఓట్‌ఫర్‌ష్యూర్' నినాదాలతో ప్రతీ ఓటరు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా నమోదైన ఓటర్లకు ఎపిక్ కార్డులను అందజేయాలని, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు

సిరిసిల్ల రూరల్, జనవరి 22 : సిరిసిల్ల పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా చిత్రలేఖన పోటీలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేపీ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఆదేశానుసారం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పరీక్షా వారియర్స్ పుస్తకంలోని మంత్రాలు, నేతాజీ సుభాష్‌చంద్రబోష్, చంద్రయాన్ , స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా, వికసిత్ భారత్, ఆదిత్య ఎల్-1 అనే అంశాలపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయని వివరించారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్టు

ఇల్లంతకుంట, జనవరి 22: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో సోమ వారం చెకుముకి సైన్స్‌టాలెంట్ టెస్టు నిర్వహించారు. రెండు విభాగాల్లో నిర్వహించిన పోటీలకు 720మంది విద్యార్థులు హాజరయ్యారు.ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, మండల బాధ్యులు మహేష్‌చంద్ర, అనీల్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం చెకుముకి టాలెంట్ టెస్టులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించడానికి టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, రవీందర్, శ్రీనివాస్, ప్రమోదిని తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం

- అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ - జిల్లాలో ఆధ్యాత్మిక శోభ



సిరిసిల్లలో సీతారాముల కల్యాణం

సిరిసిల్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జిల్లాలో ఆధ్యాత్మిక శోభను నింపింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణం, అన్నదానాలు నిర్వహించారు. దేవాలయాల వద్ద అయోధ్యలో జరిగిన కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటుచేశారు. జై శ్రీరామ్ జెండాలతో శోభాయాత్రలు నిర్వహించారు. విద్యార్థులు సైతం సైకిల్ ర్యాలీల ద్వారా భక్తిని చాటుకున్నారు. ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించారు. అయోధ్య రాముడి అక్షింతలను చల్లుకున్నారు. ఇంటి ముంగిట రంగుల రంగుల హరివిల్లులు, గుమ్మాలకు తోరణాలు కట్టారు. వ్యాపార సంస్థల యజమానులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సిరిసిల్లలో ఏటు చూసినా అయోధ్య బాల రాముడి ప్రాణప్రతిష్ఠ ముచ్చట్లే వినిపించాయి. పలు చోట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, ఇతర ప్రజాప్రతినిధులు మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.

అద్యంతం.. శోభాయమానం

రామనామం హోరెత్తింది. శోభాయామానంగా సిరిసిల్లలో వాడవాడలా సీతారాముల ఉత్సవ విగ్రహాలతో సందడిగా మారింది. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం రాత్రి సిరిసిల్లలోని శాంతినగర్ యూత్ అసోసియేషన్, కంచర వీధి భక్తాంజనేయ దేవాలయం, సుభాష్ నగర్, విద్యానగర్, వెంకంపేట, నెహ్రూనగర్ హనుమాన్ దేవాలయాల నుంచి శోభాయాత్రలు సిరిసిల్లలోని ప్రధాన వీధుల గుండా సాగాయి. రామ నామస్మరణతో భక్తులు పరవశించి పోయారు.



కల్యాణానికి హాజరైన భక్తులు



శోభాయాత్రలో భక్త జనం



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు



శోభాయాత్రలో సీతారాముల విగ్రహాలు

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

తంగళ్లపల్లి, జనవరి 22: తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన నేనర్ల ప్రశాంత్(24) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నేనర్ల శంకర్- అరుణ దంపతుల కుమారుడైన ప్రశాంత్ భవన నిర్మాణం సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో ప్రమాదం జరగడంతో గాయలై సరిగా పనిచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో మనస్థాపం చెందిన యువకుడు ఈ నెల 20వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జనవరి 22 : కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో ఉజ్వల పార్క్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన అసరి అనిల్‌యాదవ్‌దిగా వెల్లడైందని తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయగా, పారిపోయిన డ్రైవర్ తప్పట రవీందర్, యజమానిలపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు కేడీసీలో అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టులో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధృవపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 430క్వింటాళ్లు విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 978క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది.

ఉషు జట్టు రాష్ట్ర కోచ్‌గా రాణావిక్రమ్ గాంధీ


రాణావిక్రమ్ గాంధీ

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 22: జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి 28వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఉషు పోటీల రాష్ట్ర జట్టుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా గంభీరావుపేటకు చెందిన భార రాణావిక్రమ్ గాంధీ కోచ్ కమ్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తారని ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధానకార్యదర్శి పోతన శ్రీనివాస్, ఉషు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి, భార విద్యాసాగర్, జి.శుశాంక్‌రెడ్డి అభినందించారు.

గంజాయి పట్టివేత : ఇద్దరు నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 22 : కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌లో ఈ నెల 20న సాయంత్రం పోలీసుపెట్రోలింగ్ సందర్భంగా ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 1,100 కిలోల నిషేధిత గంజాయి పట్టుబడిందని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కనమల్ల ప్రభుదయాల్(20), కరీంనగర్ విద్యానగర్‌కు చెందిన తెల్ల మహేష్‌బాబు(23)ల వద్ద గంజాయి పట్టుబడగా కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలుచేసి కొంత వినియోగిస్తూ, కొంత విక్రయిస్తున్నారని తెలిపారు.

వేములవాడకు పోటెత్తిన భక్తులు

● నిరంతరాయంగా స్వామివారి దర్శనం


వేములవాడలో భక్తుల రద్దీ


వేములవాడలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు


కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, జనవరి 22: ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ సోమవారం భక్తజన ప్రవాహంగా మారింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు గత కొద్ది వారాలుగా వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వేలాదిమంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనం కోసం తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. స్వామి వారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా ముందుగా ప్రకటించిన విధంగా గర్భాలయంలో రుద్రాభిషేకం, అన్నపూజ తదితర ఆర్థిక సేవలను నిలిపివేసి శీఘ్రదర్శనం అమలు చేశారు. అయినప్పటికీ స్వామి వారి సర్వ దర్శనం కోసం సుమారు మూడు గంటల సమయం, శీఘ్ర దర్శనంకు సుమారు గంటకు పైగా సమయం పట్టింది. కోడెమొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటలకు పైగా సమయం అవసరం అయింది. రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆదివారం తెల్లవారుజామున ప్రాతఃకాల పూజ నుంచి సోమవారం రాత్రి నిశి పూజ వరకు ఆలయాన్ని నిరంతరాయంగా తెరిచి ఉంచారు. దీంతో భక్తులు ఆదివారం రాత్రి అంతా స్వామివారిని దర్శించుకునే అవకాశం లభించింది. రాత్రివేళ సైతం భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఫలితంగా సోమవారం మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. ఆది,సోమవారాలలో కలిపి సుమారు 80 వేలకు పైగా భక్తులు స్వామివారి దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ దేవాలయం కూడా భక్తులతో రద్దీగా మారింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో ఏఈఓ బి. శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, ప్రోటోకాల్ విభాగం పర్యవే క్షకుడు సిరిగిరి శ్రీరాములు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

వేములవాడ : అయోధ్యలో శ్రీ బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలోని సీతారామచంద్ర స్వామివార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు వేద పండితులు సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు.

కొండగట్టులో రాములోరికి ప్రత్యేక పూజలు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో సోమవారం శ్రీసీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు జరిపారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవమూర్తులకు అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ముత్తారం జనవరి 22: మండలంలోని మైదంబండ గ్రామంలో ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఎర్రం సురేష్ అనే వ్యక్తి ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో అదే గ్రామానికి చెందిన కొంతమందికి తెలియజేయడంతో ఎర్రం సురేష్‌ను మందలించి అక్కడి నుంచి పంపించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

చందుర్తి, జనవరి 22: ఉపాధి లేక గల్ఫ్ వెళ్లేందుకు ప్రయత్నించి అనారోగ్య కారణాలతో మెడికల్ రిపోర్టు అన్‌ఫిట్ కావడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గసికంటి అజయ్ (23) అనే యువకుడు గ్రామంలో సరైన ఉపాధి లేక గత కొద్ది రోజుల నుంచి గల్ఫ్ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. యువకుడు గతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో మెడికల్ రిపోర్ట్‌లో పలుమార్లు అన్‌ఫిట్ కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారునికి ఫోన్లు వస్తున్నప్పటికీ ఫోన్ మాట్లాడడం లేదని తల్లిదండ్రులు చూసేసరికి దూలానికి ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే తలుపులు తీసి ఆస్పత్రికి తరలించే వరకే మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల రెండు కార్లు దహనం


సర్వారంలో దహనమైన కారు


బల్వంతాపూర్‌లో దహనమైన కారు

ముత్తారం జనవరి 22: మండలంలోని మైదబండ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కారు దగ్ధం అయింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మైదబండ గ్రామానికి ఒక కారు వచ్చిందని అక్కడ గొడవ జరగడంతో ఆ కారు తిరుగు ప్రయాణంలో లక్కారం కాశిపల్లె మీదుగా అతివేగంగా వెళ్లి సర్వారం గ్రామాల్లో అదుపుతప్పి డ్రైనేజీలో పడిందని గ్రామస్థులు తెలిపారు. కారు అదుపు తప్పడంతో కారు అక్కడే వదిలేసి అందులో ఉన్న వారు వెళ్లిపోయారని సోమవారం తెల్లవారుజామున కారు దగ్ధమై ఉందని తెలిపారు. కారు దహనం చేసిన వారు ఎవరై ఉంటారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కారును పరిశీలించారు. ఇప్పటివరకు కారుకు సంబంధించిన వ్యక్తులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. కారు దహనం కావడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. మైదంబండ గ్రామానికి ఆదివారం కారులో వచ్చి బియ్యాని కిష్టస్వామిపై దాడికి పాల్పడ్డారని తిరుగు ప్రయాణంలో ఇలాంటి సంఘటన జరిగిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

కారుకు నిప్పంటించిన దుండగులు

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు నక్క అనిల్ కారును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి దహనం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... రాజారంకు చెందిన తన మిత్రుని కారును తీసుకువచ్చి అనిల్ వాడుకుంటున్నాడు. ఆదివారం తన ఇంటి వద్ద రాత్రి 11 గంటలకు పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. కొద్ది సేపటి తరువాత మంటలతో శబ్దం రావడాన్ని అనిల్ తండ్రి గుర్తించాడు. కుటుంబ సభ్యులు బయటకు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో కారు లోపలి భాగం, టైర్లతో పాటు దాదాపుగా పూర్తిగా కారు దహనం అయింది. కారు కింద కర్ర దుంగ పెట్టి పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలుస్తోందని బాధితుడు అనిల్ తెలిపాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అనిల్‌ను పరామర్శించి కాలిపోయిన కారును పరిశీలించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్సై అశోక్‌ను ఆదేశించారు.

ధర్మపురిలో వేద పారాయణం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 22: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు ఐదవ రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కేదారి ఘనాపాఠి మరో 21 మంది వేదపండితులు యధావిధిగా రుగ్వేద హవనం, సామవేద పారాయణం, శ్రీ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడా వేదపండితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజల్లో పాల్గొని ఆశీర్వచనం పొందారు. ఆలయం పక్షాన వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండి తులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ఆలయ మాజీ ఛైర్మన్ సంగనభట్ల దినేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లోన్ యాప్ వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం

కోల్‌సిటీ, జనవరి 22: లోన్ యాప్ వేధింపులు భరించలేక గోదావరిఖని 7ఎల్‌ఈపీ కాలనీకి చెందిన ఆకుల మహేష్(24) అనే యువకుడు సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై బొగ్గు రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రైలు ఇంజన్ మహేష్‌ను పట్టాలపై కొంతదూరం నెట్టుకెళ్లింది. దీంతో అతని ఎడమ చేయికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నాడు. మహేష్ సోదరుడు రాకేష్ కథనం ప్రకారం ఎంబీఏ పూర్తి చేసిన మహేష్ సింగరేణిలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవలే ఓ యాప్‌లో రుణం తీసుకున్నాడు. చాలా వరకు డబ్బులు కట్టాడు. అయినా ఇంకా వడ్డీలు, లేట్ ఫీజులతో రూ.29,860బకాయి చెల్లించాలని, లేకపోతే వాట్సాప్‌లో నీ ఫొటో, నీ కుటుంబ సభ్యుల ఫొటోలు పెట్టి నీ బంధుమిత్రులందరికీ అసభ్యంగా మెసేజ్‌లు పంపుతామంటూ బెదిరించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన మహేష్ తన స్నేహితుడికి ఫోన్ చేసి వాపోయాడు. అనంతరం రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

గుర్తుతెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

కరీంనగర్ క్రైం, జనవరి 22: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో స్పృహ కోల్పోయిన గుర్తుతెలియని మహిళ మరణించిందని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో గుర్తుతెలియని మహిళ(30-35) బస్టాండ్‌లో స్పృహకోల్పోగా ఆర్టీసీ సిబ్బంది వెంటనే ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించిందని వైద్యులు వెల్లడించారు. మహిళ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మహిళను గుర్తించిన వారు పోలీసులు ఫోన్ నెంబరు 8712670761, 9908440822కు సమాచారం అందించాలని కోరారు.

నేడు నగునూరు గురుకుల కళాశాలలో జాతీయ సదస్సు

కరీంనగర్‌రూరల్, జనవరి 22: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో ఈ నెల 23న జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి హైదరాబాద్ సౌజన్యంతో రసాయన శాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, మానిటరింగ్ టెక్నిక్స్ అనే అంశంపై ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని సదస్సుల్లో పాల్గొనవచ్చన్నారు.

31నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జనవరి 22 : ఎస్.యూ పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఎం.బీ.ఏ ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు, ఎం.సి.ఏ. ఫిబ్రవరి 12 వరకు ఎం.ఏ, ఎం.కామ్ ,ఎం.ఎస్సీ, ఎం.ఎస్.డబ్ల్యూ పరీక్షలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎస్.యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్ వి శ్రీ రంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.

అంతర్‌జిల్లా నేరస్థుడిపై పీడీ యాక్ట్ అమలు

సిరిసిల్ల క్రైం, జనవరి 22: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్‌కు చెందిన అంతర్‌జిల్లా నేరస్థుడైన కటుకోజ్వల రమేశ్ చారి(37)కు పీడీయాక్ట్ అమలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో అమాయక ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నాడని రమేశ్‌చారిపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పీ.డీ.యాక్ట్ అమలుకు ఉత్తర్వులు ఇవ్వగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నిందితుడికి ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి ఉత్తర్వులు అందజేసి సోమవారం చర్లపల్లి జైలుకు తరలించారు. గతంలో రమేశ్‌చారి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిరుద్యోగులను మోసం చేసి ఉద్యోగాలు పెట్టిస్తానని చెప్పి నమ్మించి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేయడంతో అతనిపై ఎనమిది కేసులు నమోదయ్యాయి. దీంతో కరీంనగర్ కమిషనరేట్‌లో పీడీయాక్ట్‌తో జైలుకు వెళ్లివచ్చాడు. సిరిసిల్ల, వీర్నపల్లి, వేములవాడ, తదితర ప్రాంతాలు తిరుగుతూ తక్కువ ధరకు బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులు సరఫరా చేస్తానని అమాయక ప్రజలను నమ్మించి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడడంతో అతనిపై 12కేసులు నమోదుచేసి పీడీ యాక్ట్‌తో అరెస్ట్ చేశారు.

రాజన్న భక్తులకు పాలు పంపిణీ



పాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ, జనవరి 22 : వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు స్థానిక డీఎస్పీ కే నాగేంద్రచారి ఆధ్వర్యంలో సోమవారం పాలు పంపిణీ చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న క్రమంలో సోమవారం ఉదయం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలోని కోడె మొక్కుల క్యూలైన్‌లో పట్టణ సీఐ కరుణాకర్, ప్రోటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములుతో కలిసి భక్తులకు పాలు పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థుల ఎంపిక

సిరిసిల్ల రూరల్, జనవరి 22 : రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ 2023-24కు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో రమేష్‌కుమార్, డీఎస్‌వో దేవయ్య తెలిపారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. జూనియర్స్ హెల్త్ విభాగంలో బోయినపల్లి గురుకుల కళాశాలకు చెందిన శివకార్తీక్, లైఫ్ స్టైల్ విభాగంలో ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ పాఠశాలకు చెందిన హంసిక, అల్మాస్‌పూర్‌కు చెందిన వైష్ణవి, కమ్యూనికేషన్, ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో ఇల్లంతకుంటకు చెందిన శిరీష, కంప్యూటేషనల్ టెక్నికింగ్‌లో ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన తిరుపుజు, సీనియర్స్ విభాగంలో హెల్త్‌లో హన్మాజీపేటకు చెందిన విశిష్ట, లైఫ్‌స్టైల్ విభాగంలో గంభీరావుపేట మండల దమ్మన్నపేటకు చెందిన రేష్మ, వ్యవసాయంలో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగపల్లికి చెందిన ప్రణయ్ కుమార్, కమ్యూనికేషన్ -ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో బోప్పాపూర్‌కు చెందిన అశ్వత్‌రెడ్డి, కంప్యూటేషన్ టెక్నికింగ్ విభాగంలో ఇల్లంతకుంటకు చెందిన ప్రవీణ్, ఉపాధ్యాయులనుంచి టీఎల్‌ఎం తయారీలో అల్మాస్‌పూర్ పాఠశాలకు చెందిన వెంకట్రామరెడ్డి సారథ్యంలో స్పందనను ఎంపికైనట్లు తెలిపారు.

యువ కవికి ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, జనవరి 22: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాకురుపల్లికి చెందిన యువ కవి కట్ల శ్రీనివాస్ హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో సన్మానించారు. శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో ఆదివారం కవిత వినిపించారు. యువ కవి ప్రతిభను గుర్తించిన వేదిక ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను స్థానిక సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ బాబు, స్థానికులు అభినందించారు.

రక్తదానం చేసి రామ భక్తిని చాటిన యువకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 22: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన బీఎస్పీ నాయకులు మోకినపల్లి అనిల్, బర్కాటి సుమన్ రక్తదానం చేసి రాముడిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అనిల్, సుమన్ సోమవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు వారిని అభినందించారు. 1992లో అయోధ్య రామ జన్మభూమి కోసం పోరాటం చేసిన గొల్లపల్లికి చెందిన కర సేవకుడు పిట్ల దేవయ్యను గ్రామస్థులు, యువకులు సన్మానించారు.

ఎస్సైలకు సన్మానం

చందుర్తి/రుద్రంగి, జనవరి 22: చందుర్తి ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లను వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని సన్మానించారు. నాయకుడు ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

● ఇటీవల రుద్రంగి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సిరిసిల్ల ఆశోక్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో భైరి గంగమల్లయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, సూర యాదయ్య, తర్రె లింగం, ఆశోక్, ఆక్కెనపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాఫనగర్‌లో ఉర్సు ఉత్సవాలు

గంభీరావుపేట, జనవరి 22 : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లోని హజ్రత్ మీరా శాహ ఖాదిరి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గంభీరావుపేటలోని పూజారి అబ్దుల్ రహీం ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా తీసుకెళ్లారు. ముస్తాపనగర్ దర్గా వరకు గంధం ఊరేగింపు కొనసాగింది. ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు కొనసాగుతాయి. రెండోరోజు దర్గా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్టు పూజారి రహీం తెలిపారు. పూజారి రహీంతో పాటు మోహిన్‌పాష, నసీర్, వాహీద్, లతీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 22 : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పీఎఫ్‌తో ఇతర సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు మున్సిపల్ కమిషనర్‌కు రెండు రోజుల క్రితం సమ్మె నోటీసు అందజేశారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చర్చకు రాకపోవడంతో సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పనులను బంద్ చేసి సమ్మెలోకి వెళ్లారు. సిరిసిల్ల మున్సిపల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో దాదాపు 200 మంది పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. 2009 నుంచి 2012 వరకు మూడు సంవత్సరాల పీఎఫ్ డబ్బులు కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో జమ కాలేదన్నారు. విలీన గ్రామాలకు సంబంధించిన 33 మంది కార్మికుల రెండు సంవత్సరాల వేతనాల నుంచి పీఎఫ్ కట్ చేసి వాడుకున్నారని, మున్సిపల్ నుంచి కట్టాల్సిన పీఎఫ్ డబ్బులు కార్మికులకు రావాల్సి ఉందని అన్నారు. గత ప్రభుత్వం పెంచిన 11వ పీఆర్‌సీ ఆరు నెలల ఏరియర్స్ ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను అనేక సార్లు మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని ఆరోపించారు. సచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో సిరిసిల్ల మున్సిపల్‌కు అవార్డులు రావడంలో పారిశుధ్య కార్మికుల కృషి ఉందన్నారు. అపరిష్కృతంగా పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు వెళ్లినట్లు చెప్పారు. కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణిని వీడి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య, కార్యదర్శి కాసారపు శంకర్, నాయకులు విజయ, భారతి, రాజయ్య, మమత, పద్మ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

సిరిసిల్ల టౌన్, జనవరి 22: సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కుసుమ రామయ్య జడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థి హేమంత్ వస్త్రాలను మడత పెట్టే (టాకాలు పట్టే) మిషన్‌ను తయారు చేశాడు. విద్యార్థి ప్రతిభను గుర్తించిన పుర ప్రముఖులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి హేమంత్‌ను సోమవారం సన్మానించారు. కౌన్సిలర్ వేముల రవి, గెంట్యాల శ్రీనివాస్, కుసుమ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగన్నపేటలో అన్నదానం

గంభీరావుపేట, జనవరి 22 : గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని హరిహర దేవాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొండూరు గాంధీ 2 క్వింటాళ్ల బియ్యం, 5 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దొంతినేని పాపారావు, వైస్ చైర్మన్ జోగు సురేష్, కమిటీ సభ్యులు కొండూరు గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

వెయ్యి కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లింపు

ముస్తాబాద్,జనవరి 22: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బొందుగుల రాజు సెర్(కొండాపూర్ రాజు) మొక్కు చెల్లించుకున్నాడు. రెండు నెలల క్రితం ఓ సందర్భంలో సీఎంగా రేవంత్‌రెడ్డి గెలిస్తే వెయ్యి కొబ్బరి కాయలను కొడుతానని మొక్కుకున్నాడు. మండల కేంద్రంలోని ధర్మ శాస్త్రానగర్ అయ్యప్ప ఆలయంలో పడిమెట్ల ఎదుట వెయ్యి కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నాడు.

ఊరూరా.. రామ నామస్మరణ



వేములవాడలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 22: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని పల్లెలన్నీ సోమవారం రామ నామ స్మరణతో మార్మోగాయి. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను పల్లకి, హనుమంత వాహనంపై ఊరేగించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీల ద్వారా అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను ప్రత్యక్షంగా తిలకించారు.అనంతరం అన్నదానం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం రాత్రి దీపోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేటలోని సీతారామాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు, పారాయణం నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని సీతారామాలయంలో ఉదయం 8 గంటలకు అభిషేకం, 9గంటలకు భజన కార్యాక్రమాలు, పారాయణం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఇల్లంతకుంట: రామనామజపంతో మండలంలోని గ్రామాల్లో ఆలయాలు మార్మోగాయి. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయాల్లో



తిలకిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్

ప్రత్యేక పూజలు చేశారు. ఇల్లంతకుంట, వల్లంపట్ల, అనంతారం, గాలిపెల్లి, జంగమరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో ఉదయం అభిషేకాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీతోపాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలోని సీతారామాంజనేయ ఆలయం, రంగంపేట బుగ్గ రామలింగేశ్వర ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని దేవాలయాలు, గిరిజన తండాల్లోని జగదాంబ ఆలయాల్లో అయోధ్య రాముని ప్రతిష్ఠ మహోత్సవ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అన్నదానం చేశారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిదిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, భూపతినగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, ఇప్పలపల్లె, ధూప్యానాయక్ తండా, జెగ్గారావుపల్లె, సర్ధాపూర్ గ్రామాల్లోని పలు ఆలయాల్లో అయోధ్య రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్లు సత్యఎల్లయ్య, రాజిరెడ్డి, లక్ష్మీ శంకరయ్య, నాగరాజుగౌడ్, లతమధు, కమలాకర్‌రావు, సత్యనారయణ, భూక్య రెడ్డినాయక్, అగ్గిరాములు, ఎర్రవెల్లి వెంకటరమణారావు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని సిరిసిల్ల మార్బుల్స్ అండ్ టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగాని మల్లేశం, ఉపాధ్యక్షుడు సలేంద్రీ ఐలయ్యల ఆధ్వర్యంలో శోభాయాత్ర చేపట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, సలేంద్రీ గురవయ్య, కల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంలోని మంగలిగడ్డ హనుమాన్ ఆలయంతో పాటు గ్రామాల్లో జై శ్రీరామ్ నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. ఆర్యవైశ్య సంఘం మహిళా సభ్యులు నృత్యాలు, భజన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ జనగామ శరత్‌రావు, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ బండారి సత్తయ్య, ఉత్సవాల కమిటీ చైర్మన్ గూడెపు దేవేందర్, మెర్గు అంజాగౌడ్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ రవీందర్‌గౌడ్, రాజు గురుస్వామి, కనమేని చక్రధర్‌రెడ్డి, ద్యావతి పండరి, కోల కష్ణ, ఏనుగు వేణు, నక్కదాసరి రవి, ఎద్దండి నర్సింహరెడ్డి, చెవుల మల్లేశ్, ఒరంగటి తిరుపతి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంతోపాటు అంకుసాపూర్, గండిలచ్చపేట, మండెపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోరాముడి ఉత్సవమూర్తుల శోభయాత్ర నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని పాత మార్కెట్ హనుమాన్ ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ కౌన్సిలర్లు నరాల శేఖర్, బింగి మహేష్, కోఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు బుస్స దశరథం, తాటికొండ పవన్, ఎర్ర శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

● అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేములవాడలో భక్తులు లైవ్‌లో వీక్షించారు. రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తుల సౌకర్యార్థం బీజేపీ నాయకులు అంబేద్కర్ కూడలి వద్ద భారీ ఎల్ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని లైవ్ ప్రసారం చేశారు. దీంతో భక్తులు ఆలయ పడమర భాగం మెట్లపై కూర్చొని వీక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు స్థానిక నాయకులు పులిహోర పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, చీర్లవచం, చింతలఠాణ, కొడుముంజ, శాభాష్‌పల్లి, అగ్రహారం, మారుపాక గ్రామాల్లో హన్‌మాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించగా సంకెపల్లి, ఆరెపల్లి, నాంపల్లి, బొజ్జపల్లి గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు కౌన్సిలర్‌లు నీలం కళ్యాణిశేఖర్ సర్పంచ్‌లు నవీణరాజు, సునితవేణు, రాంరెడ్డి, వెంకటరమణరావు, ప్రదీప్, రాజుకుమార్, ఎంపీటీసీలు సువర్ణస్వామి, లహరికశేఖర్ మాజీ సర్పంచ్‌లు కనుకయ్య, రాజు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని సుద్దాల, మంగళపల్లి, వట్టిమల్లతోపాటు అన్ని గ్రామాల్లో స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. నాగారం కోదండ రామస్వామి ఆలయంలో అయోధ్య బాలరామ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీజేపీ నేత చెన్నమనేని వికాస్ రావు దీప దంపతులు పాల్గొన్నారు. మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీ కుమార్, బీజేపీ జిల్లా నాయకుడు గోపాడి సురేందర్‌రావుపాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మార్కండేయ ఆలయంలో ఎల్ఈడీ స్ర్కీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం, పూజా, భజన కార్యక్రమాలు, హనుమాన్ చాలీసా పారాయణము, రామనామం, అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ సిరికొండ ప్రేమలత శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మండల్ కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది శ్రీనివాస్‌ను రామభక్తులు సన్మానించారు. జడ్పీటీసీ గట్లు మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పడాల గణేష్, గండి నారాయణ, సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పురోహితులు



వట్టిమల్లలో స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



సంకెపల్లిలో హాజరైన గ్రామస్థులు



నర్సక్కపేటలో ఉత్సవాల్లో భక్తులు



ప్రత్యేక పూజల్లో వికాస్ దీప దంపతులు



ఎల్లారెడ్డిపేటలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు



వేములవాడలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు, చిన్నారులు

అక్రమాలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 22 : సిరిసిల్ల మున్సిపల్ లో పాలక వర్గం, అధికారుల అవినీతి అక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మున్సిపల్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ జిల్లా నాయ కుడు యెల్లె లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం గాంధీనగర్ కూరగాయాల మార్కెట్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో బ్లీచింగ్ పౌడర్ వర్షం నీళ్లతో తడిసి పనికి రాకుండా పోవడంతో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాటాడుతూ బ్లీచింగ్ పౌడర్ బ్యాగ్‌లు తడిసి పనికి రాకుండా పోవడం సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కమీషన్ల కోసం అడ్డగోలుగా బ్లీచింగ్ పౌడర్ కొని ప్రజల సొమ్మును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలలో మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ పాత్ర ఉందని ఆరోపించారు. కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, జిల్లా విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. దీనిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తామ న్నారు. కాంగ్రెస్ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి అడ్డగట్ల శంకర్, ఉపాధ్యక్షులు దుబాల వెంకటేశం, స్వర్గం రాజు, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ వెల్ది రమేష్, కాంగ్రెస్ నాయకులు కుమార్, లక్ష్మణ్, బాలరాజు, రాజు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై దాడి సిగ్గుచేటు



కొవ్వొత్తులతో కాంగ్రెస్ నాయకుల నిరసన

సిరిసిల్ల టౌన్, జనవరి 22 : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపై బీజేపీ కార్యకర్తల దాడి సభ్య సమాజానికి సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీపై బీజేపీ కార్యకర్తలు దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. అస్సాంలోని సోనిత్‌పూర్ జిల్లాలో భారత్ జోడో న్యాయ్ యాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీపై బీజేపీ గూండాలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీ మీద జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సిరిసిల్ల పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మున్సిపల్ మాజీ చైర్మన్ సామల పావని, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామినేని రవీందర్, నాయకులు కాముని నళినీకాంత్, సామల దేవదాస్, వెంకటేశం, రాజు, కిరణ్, వైద్య శివప్రసాద్, బూట్ల నవీన్, వెంగళ అశోక్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 22: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో 16 దరఖాస్తులు వచ్చాయని ఇందులో రెవెన్యూ 8, జిల్లా పంచాయతీ శాఖకు 4, పౌరసరఫరాల శాఖ, లీడ్‌బ్యాంక్, సెస్, జిల్లా సంక్షేమ శాఖలకు ఒకటి చొప్పున వచ్చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఇది ఇలా ఉండగా అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం ఎఫెక్ట్‌తో ప్రజావాణి జనంలేక వెలవెలబోయింది.

ప్రజాభవన్‌లో 78 దరఖాస్తులు

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 78 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. వాటిని జిల్లా కలెక్టరేట్‌లోని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు రెండు రోజుల్లో పరిష్కరించి నివేదికలను అందించాలని సూచించారు. ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

కుమారులు పట్టించుకోవడం లేదు

కుమారులు పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని ముస్తాబాద్ మండల ఆవునూరుకు చెందిన బండ చంద్రయ్య వాపోయాడు. తాను ప్రభుత్వ వాచ్‌మెన్‌గా పని చేసి పదవీ విరమణ పొందానని, ఇద్దరు కుమారులు, కూమార్తె ఉండగా వివాహాలు జరిపించాని పేర్కొన్నాడు. కుమారులు బండ చంద్రశేఖర్, బండ అరుణ్‌కుమార్‌కు సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థ నగర్‌లో వేర్వేరుగా ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు చెప్పాడు. ఉద్యోగ విరమణ తర్వాత తన భార్య భూదవ్వతో కలిసి చిన్న కుమారుడు అరుణ్‌కుమార్ ఇంట్లో వేరుగా ఉంటు జీవిస్తున్నట్లు తెలిపాడు. కొద్ది రోజుల నుంచి చిన్న కుమారుడు అరుణ్‌కుమార్‌తోపాటు ఆతడి భార్య ఇళ్లు ఖాళీ చేసి బయటకు వెళ్లాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై పెద్ద కుమారుడి చెబితే పట్టించుకోవడం లేదని వాపోయాడు. అవునూరులో పెద్ద సమక్షంలో పంచాయితీ పెట్టిన పట్టించుకోకుండా ఇబ్బందుకలు గురి చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందించాడు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ సర్పంచ్ పంచాయతీకి చెందిన నిధులను దుర్వినియోగం చేశారని, విచారణ చేపట్టాలని పలువురు గ్రామస్థులు కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సంబంధిత అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని చంద్రవంక ప్రాజెక్టులో 250 నుంచి 300 తుమ్మ చెట్లను సుమారు రూ. 9 లక్షల నుంచి 10 లక్షలకు సర్పంచ్ అమ్ముకున్నట్లు, డబ్బులను పంచాయతీలో జమ చేయకుండా వాడుకున్నట్లు పేర్కొన్నారు. విచారణ చేపట్టి డబ్బులను రికవరీ చేయాలని, చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ అడ్డగట్ల భాస్కర్, కుర్మరాజయ్య, కుంటయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆర్‌అండ్‌ఆర్ రుద్రవరం కాలనీలోని మసీద్‌లో నూతనంగా నియమించిన ఇమామ్, మోహజాన్‌కు వేతనాలు మంజూరు చేయాలని ఇమామ్ మహ్మద్ హనీఫ్, మోహజాన్ మహ్మద్ రిజాయ్ కోరారు. సోమవారం ప్రజావాణిలో వినతి పత్రాలను అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వక్ఫ్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నా స్పందనలేదని, తమకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

సమావేశం ఏర్పాటు చేయాలి

జిల్లాలోని మసీదులు, ఖబ్రాస్థాన్‌లు, పీరీల మసీదులు, ఈద్గాల, దర్గాలకు చెందిన భూములతోపాటువక్ఫ్ భూముల సమస్యలు ఉన్నాయని, పరిష్కారం కోసం వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నూర్‌బాష స్వచ్ఛంద అవగాహన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ కోరారు. కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రాన్ని అందించారు.

బోర్‌ను సీజ్ చేయాలి

కోనరావుపేట మండలం మర్తనపేటలో అనుమతులు లేకుండా వేసిన బోరును సీజ్ చేయాలని గ్రామానికి చెందిన అయిల్నేని రాజేశ్వర్‌రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు సర్వే నంబర్ 577 బీ. 579 బీ, 580 ఏబీలో 4ఎకరాల 20 గుంట భూమి ఉందని, అందులోని వ్యవసాయ బావి పక్కనే అదే గ్రామానికి చెందిన గుర్రం రాజిరెడ్డి, గుర్రం రామయ్య అనుమతులు లేకుండా బోర్ వేశారని, తన బావిలో ఉన్ననీళ్లు తగ్గిపోతున్నాయని పేర్కొన్నాడు. అక్రమంగా బోరును వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు.